క్లుప్తంగా

విజయవాడకు నూతన బస్సు సర్వీసు



జగ్గయ్యపేట అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం జగ్గయ్యపేట ఆర్టీసీ బస్ డిపో నుంచి విజయవాడకు పలు నూతన బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును ఎమ్మెల్యే తాతయ్య శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రఘురాం, అసిస్టెంట్ మేనేజర్ రజని, డిపో సూపరిండింటెంట్ బి.నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మైనేని రాధాకృష్ణ, గట్టిడి దుర్గాప్రసాద్, కళ్యాణం కృష్ణారావు, కావేటి కృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, నకిరికంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, జి.వెంకట్రావు, పి.పుల్లారావు,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

23న దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

నందిగామ టౌన్: విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులకు ఈనెల 23వ తేదీన ఆర్టీసీ బస్సు పాసులు పంపిణీ జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాంధీ శుక్రవారం తెలిపారు. గ్గయ్యపేట డిపో మేనేజర్ రఘురాం ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి నందిగామ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పాసులు పంపిణీ చేపడతారన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



కంచికచర్ల : వరద బాధితుల సహాయార్థం ఉషోదయ పబ్లిక్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.80వేలను ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు నగదును ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు జీ మోహనరావుకు శుక్రవారం అందజేశారు.ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుర్రా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రేరణతో తల్లిదండ్రుల సహకారంతో వరద బాధితులకు ఆర్థికసాయం అందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రాజేంద్ర, డైరెక్టర్ కె.హరీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకువెళ్లిన ట్రాక్టర్



పెనుగంచిప్రోలు: మునేరు అవతల మామిడి తోటల్లో మెరక కోసం బండరాళ్లను తరలిస్తున్న ఓ ట్రాక్టర్ శుక్రవారం స్థానిక డౌన్‌సెంటర్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో హోటల్ గ్రిల్స్‌తోపాటు గోడలు పడిపోయాయి. ప్రమాదసమయంలో హోటల్‌లో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

సభ్యత్వ నమోదు పరిశీలన



నందిగామ టౌన్: సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహిస్తున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. బీజేపీ 100 రోజుల పాలనపై దేశవ్యాప్తంగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరుగంటి నరసింహారావు, మాదల రమేష్, సీతారామయ్య, బుల్లబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి హామీలేనా!

సాక్షి నెట్‌వర్క్ : తాను ఎమ్మెల్యేగా గెలిస్తే జగ్గయ్యపేట నియోజకవర్గానికి కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని.. వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 38,627ఎకరాలకు సాగునీరు అందిస్తానంటూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కరపత్రాలు పంచి మరీ ప్రచారంలో ఊదరగొట్టిన శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఎమ్మెల్యే అయి 100రోజులవుతున్నా ఆదిశగా ఒక్క అడుగు ముందుకు వేయలేదు.



ఎన్నికల ముందు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఇచ్చిన హామీల బ్రోచర్

టిడ్కో గృహాల ఊసేలేదు..

జగ్గయ్యపేట పట్టణ సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను అధికారం చేపట్టిన వెంటనే 3424 మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. కాని ఆదిశగా తీసుకున్న చర్యలు శూన్యం. వాస్తవానికి టిడ్కో గృహాల నిర్మాణం కోసం తీసుకున్న భూముల రైతులకు, నిర్మాణం చేపట్టిన సంస్థకు చంద్రబాబు హయాంలో చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను 2019 తర్వాత అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెల్లించింది. అనంతరం టిడ్కో గృహాల విద్యుత్, మంచినీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థ కోసం నాటి జగన్ ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చుచేసింది. ఈ భవనాలను లబ్ధిదారులకు అప్పగించే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆప్రక్రియ నిలిచిపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు దాటుతున్న జగ్గయ్యపేటలో టిడ్కో ఇళ్ల పంపిణీపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదనే చెప్పవచ్చు.

చెక్‌డ్యాంల నిర్మాణమెప్పుడో..

మునేరు, పాలేరు చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి తాగు,సాగునీటి కొరత లేకుండా చేస్తానని...తక్కెళ్లపాడు లిఫ్ట్ పూర్తిచేసి బలుసుపాడు, అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట, వీరభద్రునిపాలెం పరిధిలోని 4,116 ఎకరాలకు సాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. పోలంపల్లి డ్యాం రైతులకు సకాలంలో నీరుఅందేలా చేస్తానని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కానీ ఈ పనుల్లో వేటిని ఎమ్మెల్యే తాతయ్య పట్టించుకోలేదు.

హామీల వర్షంతోనే సరి...

కొత్త పరిశ్రమల ఏర్పాటు..స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఇక టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకివస్తే జగ్గయ్యపేటలో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటుకు కృషిచేస్తానని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలు, రాయితీలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. చిన్నతరహా పరిశ్రమలకు సబ్సిడీతో కూడిన రుణాలను.. రైతులకు రుణాలు, రాయితీలు అందజేస్తామని.. నియోజకవర్గంలో ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తానంటూ భారీస్థాయిలో హామీల వర్షం గుప్పించిన వైనాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తుచేస్తున్నారు.

పెత్తనమంతా చినబాబుదే...

జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) గెలిచినప్పటికీ పెత్తనం అంతా అతని సోదరుడు శ్రీరాం చినబాబుదే. ప్రజా సమస్యల పరిష్కారం నుంచి, కాంట్రాక్టులు, ఉద్యోగుల బదిలీలు, ఇతర పంచాయతీలన్నీ ఆయన కనుసన్నల్లోనే సాగుతుంటాయి. కూటమి నేతలైన బీజేపీ, జనసేన నాయకులు కూడా ఆయన చెప్పినట్టే వినాల్సిన పరిస్థితి.

హామీలు నెరవేర్చాలని డిమాండ్..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదలకు నియోజకవర్గ ప్రజలు వందలాది కోట్ల మేర ఆస్తి, పంటలను నష్టపోయారు. ఆయా ప్రభుత్వ శాఖలకు సైతం రూ.కోట్ల నష్టం వాటిల్లింది. ఇకనైనా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూరిగుడిసెలో ఉండలేకపోతున్నాం..



నా భర్త పెయింటింగ్ పనిచేస్తుంటాడు, మాకు ముగ్గురు కుమార్తెలు. ప్రస్తుతం పూరిగుడిసెలో ఉంటున్నాం. టిడ్కో ఇంటి కోసం రూ.12,500 డీడీ కట్టాను. కాని టిడ్కో ఇళ్లను మాత్రం పంపిణీ చేయడం లేదు. మాలాంటి పేదలపై దయతలచి టిడ్కో గృహాలు పంపిణీ చేయాలి..

కొచ్చెర్ల మరియమ్మ ,23వ వార్డు, జగ్గయ్యపేట

టిడ్కో ఇంటికోసం ఎదురుచూస్తున్నాం..



గురుకుల పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు, ఒంటరిగా ఉంటున్నాను. ఓ కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. టిడ్కో ఇల్లు ఇస్తామంటూ 2018లో బంగారు గొలుసు అమ్మి డబ్బులు కట్టాను. ఇంత వరకు ఇల్లు ఇవ్వలేదు. టిడ్కో ఇంటి కోసం ఆరేళ్లుగా ఎదురుచేస్తున్నా.

నలవాది పద్మ, జగ్గయ్యపేట

ఎన్నికల హామీలు గాలికి...

కంచికచర్ల : తాను ఎమ్మెల్యేగా గెలిస్తే వేదాద్రి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించి రైతులకు సాగునీరు అందిస్తానంటూ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నేటివరకు పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

కలగానే ఆటోనగర్ ఏర్పాటు..

కంచికచర్ల మండలం పేరకలపాడు, గొట్టుముక్కల గ్రామాల్లో ఎన్నికల సమయంలో పర్యటించి రైతులకు సుబాబుల్ కర్రకు మంచిధర వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కంచికచర్లలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషిచేస్తానని... గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తామంటూ ఇచ్చిన హామీలన్నీ కూడా ఇంకా ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నందిగామ ఎమ్మెల్యేగా తంగిరాల సౌమ్య గెలుపొంది వంద రోజులవుతుండగా ఆయా హామీల అమలుకు ఆమె తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం.

ఉద్యోగుల తొలగింపు..

నియోజకవర్గంలో కొత్తగా ఉద్యోగాలు ఇచ్చేమాట దేవుడెరుగు. ఉన్న ఉద్యోగులను టీడీపీ నాయకులు తమవారి కోసం తొలగిస్తున్నారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు, డ్వాక్రా బుక్ కీపర్లు, ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తున్నారు. ఆయా ఉద్యోగుల స్థానంలో టీడీపీ నాయకులు తమవారిని నియమించుకుంటున్నారు. దీంతో దశాబ్దానికిపైగా ఆయా ఉద్యోగాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారిని తొలగిస్తుండటంతో వారు ఉసూరుమంటున్నారు.

లెక్కకు మించిన హామీలు ఇచ్చి...

నియోజకవర్గంలో రోడ్లకు మరమ్మతులు చేపడతానని... గ్రామాల్లోని డ్రైనేజీలను ఆధునీకరిస్తానని.. మోగులూరు వద్ద మునేరుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని, మంచినీటి పథకాలను బలోపేతం చేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తానని.. కాలంచెల్లిన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తస్తంభాల ఏర్పాటుకు కృషిచేస్తానని..నందిగామ పట్టణం అంతర్గతరోడ్ల అభివృద్ధి.. డ్రైనేజీ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తానని ..ఇలా లెక్కకు మించిన హామీలను ఎన్నికల సమయంలో గుప్పించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారం చేపట్టి వందరోజులవుతున్నప్పటికీ ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధితశాఖల అధికారులతో కనీస సమావేశాలు నిర్వహించకపోవడంపై నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారం, ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలను సైతం కలసి తగిన చర్యలు తీసుకోని వైనాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు.

కల్వర్టుల నిర్మాణం ఎప్పుడో...

వాగులపై కల్వర్టులు నిర్మిస్తామని ఎమ్మెల్యే సౌమ్య హామీ ఇచ్చారు. అయితే ఇటీవల వర్షాలకు వాగులు వంకలు పొంగి పొంగి గ్రామాల్లో ప్రజల రాకపోకలు స్తంభించాయి. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటల వైపు ఎమ్మెల్యే కన్నెత్తి చూడలేదనే విమర్శలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లను ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి నాణ్యమైన రోడ్లను వేయిస్తామని ఎన్నికల సమయంలో తంగిరాల సౌమ్య హామీ ఇవ్వగా, ఇటీవల సంభవించిన వర్షాలకు ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు, పొలాలకు వెళ్లే డొంకరోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే సౌమ్య స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని నందిగామ నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం



చిన్నారులతో మాట్లాడుతున్న ఏసీడీపీఓ నాగమణి

నందిగామ టౌన్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యరేణుక పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై గర్భిణీలు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ పోషకాహార లోపాలను నివారించుకోవాలంటే విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటంతోపాటు రక్తహీనత లోపాలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. అనంతరం నందిగామ, చందర్లపాడు మండలాల అంగనవాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్తలచే యోగాసనాలు, వ్యాయామం చేయించారు. సూపర్‌వైజర్లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబీ, ఇస్రత్, శ్రీదేవి,శ్రీలత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట:పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీడీపీఓ నాగరాణి మాట్లాడుతూ గర్భిణులు అంగనవాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అంగనవాడీ కార్యకర్తలు గర్భిణీలు, బాలింతల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. యోగాపై గర్భిణులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రజని, కార్యకర్తలు అనంతలక్ష్మి, లక్ష్మీకాంతం, సీతమ్మ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: రోజూ యోగా చేయడం ద్వారా ఎముకల పుష్టితోపాటు రోగనిరోధకశక్తి పెరుగుతుందని ఎంపీడీఓ సాయిహర్ష పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టాలన్నారు. అనంతరం యోగాపై చిన్నారులు, తల్లిదండ్రులకు శిక్షణనిచ్చారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఏబీపీ కోఆర్డినేటర్ మోహన్ సందీప్, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే రాజగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి గుడారు పేరయ్య, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఈఓపీఆర్డీ సాంబశివరావు, మాజీ సర్పంచి జగజీవన్‌రాం, నాయకులు కట్టా నరసింహారావు, తూమాటి నాగేశ్వరరావు, ప్రభాకర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు




పేట తొర్రగుంటపాలెంలో దీపాలతో వినాయకుడు, ఓంకారం ప్రతిరూపాలను ఏర్పాటు చేస్తున్న భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలో 12వ రోజు శుక్రవారం పలు వార్డుల్లోని మండపాలలో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తొర్రగుంటపాలెంలోని చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు వినాయకుడు, ఓంకారం, శివుడు, త్రిశూలం, స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

నిమజ్జనాల సందడి...

వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. వినాయకుడి విగ్రహాలను వేదాద్రి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా వత్సవాయి మండలంలోని మంగొల్లు గ్రామవాసులు ఏర్పాటు చేసిన గణనాథుని ఊరేగింపు ప్రత్యేకాకర్షణగా నిలిచింది.



ప్రత్యేకాకర్షణగా నిలిచిన మంగొల్లు గణనాథుడు

వైఎస్సార్ సీపీలో ఇమడలేకే రాజీనామా

సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీలో ఇమడ లేక ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. శుక్రవారం స్థానిక పంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో తనకు తగిన గుర్తింపు లేకపోవడం వలనే మనస్తాపానికి గురయ్యానన్నారు. రెండు పర్యాయాలు మంత్రి పదవి వస్తుందని ఎదురుచూసినప్పటికీ నిరాశ పరిచారన్నారు. అలాగే తాను భవిష్యత్‌లో ఏ పార్టీలో ఉన్నప్పటికీ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి రాజకీయంగా భిక్షపెట్టిన వైఎస్సార్‌ను ఎన్నటికీ మరచిపోనన్నారు. వారి ఆశయాల స్ఫూర్తితో ముందుకు వెళ్తానన్నారు. అలాగే వైఎస్సార్ సీపీలో తనకు ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించడంతోపాటు విప్‌గా, టీటీడీ బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 22న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు.

బాధిత కుటుంబానికి చేయూత

కంచికచర్ల : పాల ఉత్పత్తిదారులకు తమ యూనియన్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని మైలవరం క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కంచికచర్ల పాల సంఘ సభ్యురాలు చింతపల్లి చంద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందగా కృష్ణా క్షీరబంధు పథకం కింద ఆమె కుటుంబసభ్యులకు రూ.50వేల చెక్కును అందజేశారు. అదేవిధంగా గంజిలంక చౌరమ్మ కుమారుడు వివాహం సందర్భంగా రూ.20వేల విలువగల గోల్డ్‌కాయిన్‌ను అందజేశారు. సంఘ అధ్యక్షులు అంచా కవిత, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

సేవాకమిటీ అక్రమాలపై విచారణ

జగ్గయ్యపేట అర్బన్: సత్యనారాయణపురంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం-శ్రీఆనందసాయి ఆలయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై జగ్గయ్యపేట కోర్టు ఆదేశాల మేరకు నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ విచారణ చేపట్టారు. సేవా కమిటీ సభ్యులు నకిరికంటి నాగేశ్వరరావు తదితరులపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు విచారణ చేపట్టారు. జగ్గయ్యపేటలోని ఆలయాలను ఏసీపీ శుక్రవారం సందర్శించారు. సేవా కమిటీ సభ్యులను, అర్చకులను విచారించారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

నందిగామ టౌన్:పోలీసులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని డీసీపీ మల్లికార్జున మహేశ్వరరాజు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమరవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం నందిగామ గాంధీ సెంటరులో ట్రాఫిక్‌ను, చందాపురం, రాఘవాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దీపావళి మందుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సీఐ వైవీఎల్ నాయుడు ఉన్నారు.

పేదల ముఖాల్లో చిరునవ్వులు : ఎమ్మెల్యే సౌమ్య



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

బత్తినపాడు(కంచికచర్ల) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని బత్తినపాడులో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న బత్తినపాడు - చెవిటికల్లు రోడ్డుకు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. వరదల వల్ల నష్టపోయిన పంటలను గుర్తించి అధికారులు తుంట నష్ట వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని సూచించారు. సర్పంచి జంగా సంతోషరావు, తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ కే శిల్ప, ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం...

నందిగామ టౌన్: బీసీ రిజర్వేషన్లను 33 శాతం పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్ల పెంచాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తంచేస్తూ స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఆమె క్షీరాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే బీసీలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

వాగు చప్టాకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లే రోడ్డులో మునేరు అవతల తువ్వకాలువ వాగు చప్టాకు మరమ్మతులు చేపట్టారు. ఈనెల 16న 'ప్రమాదకరంగా వాగు చప్టా' అను శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కుంగిన చప్టాను తొలగించి కాలువపై తూములు ఏర్పాటు చేసి గ్రావెల్‌తో రోడ్డు నిర్మించారు.



వాగు చప్టాకు పూర్తయిన మరమ్మతులు

క్రీడా పోటీలు ప్రారంభం



జమ్మవరంలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

జమ్మవరం(వీరులపాడు): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి సూచించారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతతోపాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో సర్పంచి మల్లెల అనూషరాణి, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, ఎంఈవో పాల్ కెనడీ, పీడీలు వాసిరెడ్డి సాంబశివరావు, సింగి రాజు, విద్యా కమిటీ చైర్మన్‌రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.